విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

గుడివాడలో బ్లేడ్ బ్యాచ్ అరాచకాలు

- యవకుడిపై కత్తులతో దాడి

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక ఓవర్ బిడ్జిపై బ్లేడ్ బ్యాచ్ అరాచకాలు సాగిస్తున్నారు. ప్రతి రోజు రాత్రి సమయంలో ఈ బ్యాచ్ మద్యం, గంజాయి సేవిస్తూ ఒంటరిగా వెళ్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారు. మంగళవారం రాత్రి ఒరిస్సాకు చెందిన గోపాల్‌కుమార్ అనే యవకుడిని కత్తులు చూపించి డబ్బు ఇవ్వాలని కోరగా అతను నిరాకరిచండంతో అతనిపై కత్తులతో మెడ, గోంతుపై దాడి చేశారు. కొంత మంది అటుగా వెళ్ళే వాళ్లు క్షతగాత్రుడిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. 2టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నరు. ఓవర్ బిడ్జి సమీపంలో ఉండే అసాంఘీక శక్తులకు కళ్లేం వేయాలని, పోలీసు గస్తిని పెంచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : జిల్లా హౌసింగ్ పీడీ

విశాలాంధ్ర-గుడివాడ : మాల్లాయిపాలేంలో నిర్మాణ పనులను జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీ.వి సూర్యనారాయణ పరిశీలించారు. బుధవారం మల్లయ్యపాలెం జగనన్న హౌసింగ్ లే-అవుట్‌ను అయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)చొరవతో గృహనిర్మాణలు శరవేగంగా పనులు చేస్తున్నారు. లబ్ధిదారుల సౌకర్యార్థం లే-అవుట్‌లో ఇంటర్నల్ రోడ్లు, వాటర్, కరెంట్ సప్లై పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ రామోజీనాయక్, పిఆర్‌డిఇ హరినాథ్‌బాబు, హౌసింగ్ ఏఇ సుబ్బారావు, పిఆర్ ఏఇ రామ్మోహన్‌రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి 'జరబన'

విశాలాంధ్ర-విజయవాడ : నిరంతరం కార్మికులు, ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం పాటుపడి అకాల మృత్యువాత పడిన జరబన నాగేశ్వరరావు చిరస్మరణీయులని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు కొనియాడారు. ఉమ్మడి కృష్ణాజిల్లా సీపీఐ ప్రముఖులు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అమరులు జరబన ప్రథమ వర్ధంతి కార్యక్రమం బుధవారం స్థానిక పెనమలూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జరబన విద్యార్థి దశలో కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులై దాదాపుగా 45 ఏళ్ల పాటు ప్రగతిశీల ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టీ తాతయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దు వాసుదేవరావు మాట్లాడుతూ క్రమశిక్షణ నిబద్ధతకు నిదర్శనంగా జరబన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు మేరుగు విజయ్‌కుమార్, దాగని సంగీతరావు, లింగం ఫిలిప్, నాయకులు మోతుకూరి అరుణకుమార్ పాల్గొన్నారు. తొలుత జరబన నాగేశ్వరరావు చిత్రపటానికి ఎర్రదండతో నివాళులు అర్పించారు.

భూవివాదాలకు తావు లేకుండా ...

జగనన్న శాశ్వత భూహక్కు

విశాలాంధ్ర-మచిలీపట్నం: భూ వివాదాలకు తావు లేకుండా భూ లావా దేవీలు సులభతరం చేసేందుకు ప్రభు త్వం వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా భూ యజమానులకు భూహక్కు పత్రాలు పంపిణీ నేటి నుండి 15 రోజుల పాటు అందచేసే కార్య క్రమాన్ని బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లా నరసన్న పేటలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ డా.మహేష్‌కుమార్ రావిరాల లైవ్‌లో వీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వందేళ్ళ తరువాత దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రప్రభుత్వం ఆధునిక సమగ్ర భూ రీసర్వే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించింద న్నారు. భూవివాదాలకు తావు లేకుండా భూలావాదేవీలు సులభతరం చేసేందుకు ప్రభుత్వ హామీతో కూడిన శాశ్వత భూహక్కు పత్రం జారీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం క్రింద భూరికార్డుల ప్రక్షాళనతో పాటు భూకమతానికి విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించి, భూరికార్డులను సురక్షితంగా, వివాదరహితంగా నిర్వహించడం, భావితరాలకు వివాదాలు లేని ఆస్థి ఇవ్వడం కోసం సమగ్ర రీసర్వే ప్రభుత్వం చేపట్టిందన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం కింద మొదటి విడతలో 100 గ్రామాల్లో చేపట్టిన రీసర్వే పనులు నూరుశాతం పూర్తి చేయడం జరిగిదందన్నారు. స్వామిత్వ కార్యక్రమం క్రింద గ్రామకంతాలలో రీసర్వే పనులు ఇప్పటి వరకు 5 గ్రామాల్లో పూర్తి చేశారన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

జాయింట్ కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్

విశాలాంధ్ర-పెడన/బంటుమిల్లి : పెడన, బంటుమిల్లి మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ తనిఖీ చేశారు. తొలుత పెడన మార్కెట్ యార్డులో కేంద్రాన్ని సందర్శించి ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ధాన్యం ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనెసంచులు ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉంచుకోవాలని సేకరించిన ధాన్యం మిల్లులకు కూడా రవాణా చేసేందుకు అవసరమైన వాహనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ధాన్యం సేకరణలో నూతన విధానాలు రైతులకు తెలియజేయాలని ధాన్యం కొనుగోలు ప్రక్రియ పట్ల రైతులకు తగిన అవగాహన కల్పించాలని ఎక్కడ ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం తేమ శాతం నిర్ధారణలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ తనిఖీలలో జాయింట్ కలెక్టర్ తో పాటు సివిల్ సప్లైస్ డీఎం శ్రీధర్, పెడన మండల తహసిల్దార్ పి మధుసూదన రావు, కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.

పవన్, చంద్రబాబు కలిస్తే వైసీపీకి చెమటలు

విశాలాంధ్ర-మచిలీపట్నం: పవన్‌కళ్యాణ్‌ను చంద్రబాబునాయుడు కలిస్తే వైసిపి నాయకులకు చెమటలు పడుతున్నాయని మాజీమంత్రి, టీడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా తయారు చేశారని దుయ్యబట్టారు. నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు ఛార్జీలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి రాష్ట్రంలో సామాన్యులు బతకలేని పరిస్థితి కల్పించారన్నారు. ఆఖరికి చెత్త మీద కూడా పన్ను వేసి వీరబాదుడు బాదుతూ ప్రజాధనాన్ని దోచుకుతింటున్నారని మండి పడ్డారు. తెలుగుదేశం పార్టీ బాదుడే బాదుడు కార్యక్రమం సంవత్సరకాలంగా నిర్వహిస్తే ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారన్నారు. వైసిపి గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహిస్తే ప్రజలు తరిమి తరిమి కొట్టారు. పాలనలో పూర్తిగా వైఫల్యం చెందిన ముఖ్యమంత్రి మొన్న నరసాపురం సభలో, ఈరోజు శ్రీకాకుళం సభలో ప్రజలకు ఏం చెప్పాలో తెలియక తడబడుతున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నిక లలో వైసిపి నాయకులకు కనీసం డిపాజిట్లు కూడా రావని తెలిసి జగన్‌రెడ్డికి చెమటలు పడుతున్నాయన్నారు. బందరులో రూ.330 కోట్లతో ఫిషింగ్ హార్బర్ కేటాయించామని చెబుతున్నారని, ఇంతవరకు ఎంత విడుదల చేశారని ప్రశిస్తే లెక్కలు లేవన్నారు. మీ అవినీతి భాగోతం గురించి వైసిపి నాయకులే చెబుతున్నారన్నారు. ఇసుకలో, బుసకలో, ఇళ్ళస్థలాల పేరుతో, మట్టి పూడికలో ఎంత దోచుకున్నారో చిట్టా అంతా మీ వైసిపి నాయకులే తయారు చేసుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి ఒక అవినీతి సామ్రాట్ అని ఆరోపించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు అంతా సామంతరాజులుగా రాష్ట్రం తయారైందన్నారు. జోగి రమేష్ చేతకాని మంత్రి అని, హౌసింగ్ మంత్రిగా ఉండి కనీసం నీ నియోజకవర్గంలో ఎన్ని ఇళ్ళు కట్టించావో చెప్పగలవా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో జిప్లస్ త్రీ ఇళ్ళు కొన్ని వేలు కట్టిస్తే కనీసం వాటిని ప్రజలకు వాటిని అప్పగించడం లేదని మండిపడ్డారు. కరెంటు రేట్లు, సీడ్ రేట్లను పెంచి జె ట్యాక్స్ కోసం ఆక్వారంగంపై పెనుభారాన్ని మోపుతున్నారన్నారు. క్రాప్ హాలిడే పెట్టి ధాన్యం రైతుల్ని, కరెంట్, సీడ్, ఫీడ్ ధరలను పెంచి ఆక్వా రైతుల్ని జగన్మోహనరెడ్డి నట్టేట ముంచుతున్నారని ధ్వజమెత్తారు. ఆక్వా రైతులకు గతంలో రూ.5వేలు వచ్చే కరెంటుబిల్లు ఇపుడు రూ.30వేల నుంచి రూ.35 వేల వరకు వచ్చే పరిస్థితి దాపురించిందన్నారు. గతంలో రూ. 500కు కొన్న 30కౌంట్ రొయ్యలు ఇపుడు కనీసం రూ.150కి కొనే పరిస్థితి కూడా లేక ఆక్వారైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి తలెత్తిందన్నారు. వీటిపై ప్రశ్నిస్తున్నందుకు తెలుగుదేశం పార్టీ నాయకులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గత కొన్ని రోజులుగా చంద్రబాబు సభలు జరిగిన జగ్గయ్యపేట, నందిగామ, ఆదోని, పత్తికొండ పర్యటనల్లో అశేష జన ప్రభంజనాన్ని చూసి తట్టుకోలేక జగన్ తనలో తను కుమిలిపోతున్నాడన్నారు. ప్రధానమంత్రి విశాఖ పర్యటనకు వచ్చినపుడు స్పెషల్ స్టేటస్, పోలవరం, రైల్వేజోన్, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ గురించి మాట్లాడకుండా ఆయనకు సపర్యలు చేయటంలో మునిగిపోయావా జగన్మోహనరెడ్డి అని హేళన చేశారు. ప్రభుత్వ దుర్మార్గాలపై తెలుగుదేశం పార్టీ డిసెంబర్ 1నుంచి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం ద్వారా ప్రజలలోకి వెళ్ళబోతుందన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు ఇలియాస్ పాషా, కుంచె దుర్గాప్రసాద్, తలారి సోమశేఖర్, పిప్పళ్ళ వెంకట కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

అలల ఉధృతికి కొట్టుకుపోతున్న

యువకులను కాపాడిన కానిస్టేబుల్

విశాలాంధ్ర-మచిలీపట్నం: మంగినపూడి విహారయాత్రకు వచ్చి సముద్రస్నానం చేస్తూ అలల తాకిడికి కొట్టుకుపోతున్న ముగ్గురు యువకులను కానిస్టేబుల్ నాగరాజు కాపాడి పలువురి మన్ననలు పొందారు. సేకరించిన వివరాల ప్రకారం విజయవాడలో ఒక ప్రైవేట్ కళాశాలలో బి.టెక్ చదువుతున్న ముగ్గురు యువకులు సరదాగా మంగినపూడి బీచ్‌కు వచ్చి సముద్రంలోకి దిగారు. ఉధృతంగా వచ్చిన అలల తాకిడికి లోపలికి కొట్టుకుపోతుండగా గమనించిన బందరు తాలూకా పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ నాగరాజు స్థానిక జాలర్లు, స్థానికుల సహకారంతో వారిని రక్షించాడు. తన వద్ద ఉన్న తాడును తీసుకుని ఒక చివర నడుముకు కట్టుకుని మరొక చివర ఒడ్డున ఉన్నవారిని పట్టుకోమని ఇచ్చి సముద్రంలోకి కొట్టుకుపోతున్న ముగ్గురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ముగ్గురు విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉండడంతో వారికి కొద్దిసేపు విశ్రాంతి అందించి సురక్షితంగా వారి గమ్యస్థానాలకు పంపే ఏర్పాట్లు చేశారు. ఆపదలో ఉన్న వారిని కాపాడడానికి తన ప్రాణాన్ని సైతం లెక్క చేయని కానిస్టేబుల్ సాహసాన్ని స్థానికులు అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రామాల్లో నాటు సారా తయారీ, మత్తు పదార్థాల అమ్మకాలు వంటివి నిషేధమని ప్రభుత్వ నిబంధనలు ఉల్లంగించే వారిపై గ్రామ బహిష్కరణ, పిడి యాక్ట్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో మొవ్వ ఎస్ఐ జి లక్ష్మి తెలిపారు. జిల్లా ఎస్పీ పి జాషువా, ఎస్ ఈ బి అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామాల్లో వీటిపై అవగాహన కల్పించే దానిలో భాగంగా బుధవారం కోసూరులో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటు సారాయి తయారీ, అమ్మకాలు ఇతర మత్తు పదార్థాలు వాడకంపై సమాచారం తెలిస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. వారి సమాచారంగోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెనుమూడి రమేష్, విఆర్‌ఓ. కేపీ నెహ్రూ, సచివాలయ సిబ్బంది, ఆ శాఖ మొవ్వ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాటరీ చోరీలకు చెక్

దొంగను పట్టుకున్న ఎస్ఐ సందీప్
ట్రక్కు ఆటో..19 బ్యాటరీలు స్వాధీనం

విశాలాంధ్ర-చల్లపల్లి : అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో వరుసగా జరుగుతున్న బ్యాటరీ చోరీలకు చల్లపల్లి పోలీసులు చెక్ పెట్టారు. పగలంతా పాత సామాన్లు కొనేవాడిలా ఆటోలో తిరుగుతూ రాత్రి వేళ పార్కింగ్ చెసిన వాహనాల్లోని బ్యాటరీలు దొంగిలిస్తున్న దొంగ ఆట కట్టించారు. చల్లపల్లి, అవనిగడ్డ, మోపిదేవి, కోడూరు పోలీసుస్టేషన్‌లకు సంబంధించి 9 చోరీ కేసులకు ప్రధాన కారకుడైన కూచిపూడి శివారు ధర్మవరంకు చెందిన సింహాద్రి బాలచంద్ అలియాస్ చందును చల్లపల్లి ఎస్ఐ డి.సందీప్ చాకచక్యంగా అరెస్ట్ చేశారు. చల్లపల్లి పోలీసు స్టేషన్లో ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో చల్లపల్లి సిఐ బి.బి.రవికుమార్ కేసు వివరాలు తెలియచేశారు. చల్లపల్లి.. అవనిగడ్డ పరిసర ప్రాంతాల్లో ఖాళీ ప్రదేశాల్లో నిలిపిన బస్సులు, లారీలు, ట్రాక్టర్ ల నుంచీ బ్యాటరీలు దొంగిలిస్తున్నారనే సమాచారం మేరకు జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశాలతో అవనిగడ్డ డీఎస్పీ మహబూబ్ భాషా, చల్లపల్లి సిఐ బి.బి.రవికుమార్ సూచనలతో ఎస్ఐ డి.సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సీసీ ఫుటేజీలు పరిశీలించి,అనుమానితులను ప్రశ్నిస్తూ కేసు దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ సందీప్ చల్లపల్లి ఎన్టీఆర్ పార్కు సమీపంలో వాహన తనిఖీలు చేస్తుండగా ఓ ట్రక్కు వాహన డ్రైవర్ పోలీసులను చూసి వెళ్లిపోతుండటం గమనించిన ఎస్ఐ ఆటోను అడ్డుకుని అందులో బ్యాటరీలు ఉండటం గమనించి అతడిని విచారించి వరుస చోరీల గుట్టు రట్టు చేశారు. ట్రక్కు ఆటో..అందులోని 19 బ్యాటరీలు స్వాధీనం చేసుకుని చందును అరెస్ట్ చేసారు. మొత్తం నాలుగు స్టేషన్లో 9 కేసులకు సంబంధించి రూ.1.68 లక్షల విలువైన బ్యాటరీలు రికవరీ చేశారు. బ్యాటరీ దొంగతనాలకు అడ్డుకట్ట వేసి నిందితుడిని అరెస్ట్ చేసిన చల్లపల్లి ఎస్ఐ సందీప్, సిబ్బందిని సిఐ రవికుమార్ అభినందించారు.

నాటు సారా స్థావరాలపై మెరుపు దాడులు

విశాలాంధ్ర-పెడన: నాటు సారా స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహిస్తున్నారు. బుధవారం పెడన మండలం యస్.వి.పల్లి గ్రామ పరిధిలో యస్.ఈ.బి. ఇన్‌స్పెక్టర్ షేక్ రమేష్ సిబ్బందితో దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎవరికి అనుమానం రాకుండా నాటు సారా తయారు చేస్తున్న పామర్తి వంశీకృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి 5 లీటర్ల, నాటు సారాను, 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి వంశీకృష్ణను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

ముగిసిన పాఠశాల స్థాయి ఎగ్జిబిషన్స్

విశాలాంధ్ర-కూచిపూడి : జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు రెండు రోజులుగా ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న సైన్స్ మరియు లెక్కల ఎగ్జిబిషన్స్ బుధవారంతో ముగిశాయి. వీటిలో ఎంపికైన అంశాలను డిసెంబర్లో నిర్వహించే మండల స్థాయి ఎగ్జిబిషన్లో ప్రదర్శిస్తారు. దీనిలో భాగంగానే కూచిపూడి లోని శ్రీ సిద్ధేంద్ర ఓరియంటల్ జిల్లా పరిషత్ హైస్కూల్ లో 65 కు పైగా మూడు నుంచి 10వ తరగతి విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను బుధవారం విద్యార్థులు తిలకించారు. విద్యాశాఖ సూచనల మేరకు ప్రతి పాఠశాలలో ఐదు అంశాలలో తయారు చేసి ప్రదర్శించారు. దానిలో థీమ్స్ ఫర్ ది స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రాం ఎగ్జిబిట్స్, గణిత నమూనాలు, హెల్త్. అండ్.క్లీన్ నెస్, ఎన్విరాన్మెంటల్ అండ్ క్లైమేట్ చేంజ్.యకో.. ఫ్రెండ్లీ మెటీరియల్.లో విద్యార్థులు రూపొందించిన అంశాలలో స్టూడెంట్స్ కు సంబంధించిన యాప్ నమూనా, వరదలలో కూడా నివాసముండే ఫ్లోటింగ్ ఇల్లు, పారిశుద్ధి కార్యక్రమంలో భాగంగా చెత్త సంపదను విడగొట్టే విధానాలు తదితర అంశాలు ఆకట్టుకున్నాయి. ఈ హైస్కూల్లో ఎగ్జిబిషన్ హెచ్ఎం అన్నేలక్ష్మి కుమారి ప్రారంభించి కొనసాగించగా ఉపాధ్యాయులు వై. నాగలక్ష్మి, డి లక్ష్మీ కుమారి, ఏ. పద్మ, ఎం.ఎల్ .మంజూష, జీ.వి. సత్య ప్రసాద్, ఏ. సురేష్, సి .ఆర్ .పి. తాతా సమర్పణ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తిలకించారు. హై స్కూల్లో మాత్రమే నిర్వహించిన ఈ ఎగ్జిబిషన్స్ మొవ్వ, కోసూరు, కాజ, నిడుమోలు, చినముత్తేవి, భట్ల పెనుమర్రు, పెదసనగల్లు జిల్లా పరిషత్ హై స్కూల్లో, పెదముత్తేవి సంస్కృత ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు..

నాటకాలాడుతున్నారు : బచ్చుల

విశాలాంధ్ర-గన్నవరం : తప్పుచేయడం తప్పుడు ఆధారాలతో తప్పించుకోవాలని చూ డటం ఏ2కి వెన్నతో పెట్టిన విద్య అని ఎమ్మెల్సీ, గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి బచ్చుల అర్జునుడు ఆరోపించాడు. ఉంగుటూరు మం డలం పొట్టిపాడు, తేలప్రోలు గ్రామాలలో నిర్వ హించిన గ్రామ చైతన్య కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారై మాట్లాడుతూ విజయసాయి ఫోన్‌ని జగన్‌రెడ్డే తాడేపల్లిప్యాలెస్ నేలమాళిగలో దాచా డనే అనుమానం కలుగుతోంది. లిక్కర్ స్కామ్ బయట పడ్డాకే విజయ సాయిరెడ్డి ఫోన్ పోవడంలో అంతర్యం ఏమిటి? పోయిన ఫోన్‌లో శరత్ చంద్రారెడ్డి, విజయ సాయిరెడ్డిల లావాదేవీలు, ఢిల్లీ లిక్కర్ స్కామ్ లావా దేవీలు, ఇతరని గూఢ అంశాలు దాగున్నాయనే అను మానం కలుగుతోంది. తాడేపల్లి ప్యాలెస్ అంటే కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్లమధ్య వీఐపీలు ఉండే ప్రదేశం.. అలాంటిచోట ఫోన్ పోయే అవకాశాలుం టాయా? అక్కడేమైనా దొంగలున్నారా.. పాలకులు ఉండేప్రదేశంలో దొంగలు ఉండటం ఏమిటి? అన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు వ్రదాణం హరిబాబు, మం డల పార్టీ అధ్యక్షుడు ఆరుమళ్ళ వెంకట కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆళ్ళహనూక్, సాగునీటి వినియోగదా రుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణా రావు, సీనియర్ నాయకుడు చిరుమామిళ్ల సూర్యం, పొట్టిపాడు అధ్యక్షుడు ఈసరి రవికుమార్, తేలప్రోలు అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి, తాటిపాముల నాగయ్య, వేమారెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు

నటశేఖర కృష్ణకు సినీస్వర నీరాజనాలు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, తెలుగు కళావాహిని, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ శ్రీ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయం హాలులో జరిగిన సినీ సంగీత విభావరి నటశేఖర కృష్ణకు సినీస్వర నీరాజనాలర్పిస్తూ సాగింది. చింతకాయల చిట్టిబాబు,కోట వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షణలో డేవిడ్ రాజు వ్యాఖ్యాతగా వ్యవహరించగా గాయనీ గాయకులు మల్లాది స్వాతి, పావని,శ్రీదుర్గానాగమణి,షబన,డేవిడ్ రాజు,మోహన్ రాజు, ఎం రాజు,రాజేష్, జగన్మోహనరావు, నాగేశ్వరరావు, మద్దెల శ్యాంప్రసాద్ లు తెలుగువీర లేవరా, వస్తాడు నా రాజు ఈ రోజు, ఎన్నాళ్ళో వేచిన ఉదయం,మా వూళ్ళో ఒక పడుచుంది, ఓ చిన్నదాన నన్ను విడిచి, నీలో నేనై నాలో నీవై,మనసు పరిమళించెనే,డ్డిరి డిరి డిరి డ్డి రిడి వంటి పాటలను రసరమ్యంగా పాడి వినిపించారు.

చెరువులో పడి వృద్ధుడు మృతి

విశాలాంధ్ర-గన్నవరం : చెరువులో పడి వృద్ధుడు మృతి చెందాడు. గన్నవరం శివారు మర్లపాలెం చెరువు వద్ద బుధవారం చోటుచేసుకుంది. మర్లపాలెం గ్రామానికి చెందిన షేక్ నాగూర్ (50) బహిరభూమికి వెళ్లి ప్రమాదవశాస్తూ చెరువులో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడవల్లి ఎస్సీ కాలనీలో వైద్య శిబిరం

విశాలాంధ్ర-గన్నవరం : మండలంలోని ఆయుష్ గ్రామం గూడవల్లి గ్రామం నందు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వారిచే గూడవల్లి గ్రామంలోని ఎస్ సి కాలనీ లో బుధవారం వైద్య శిబిరం నిర్వహించబడింది. దీనిలో భాగంగా సీజనల్ వ్యాధుల పట్ల వారు తీసుకోవాల్సిన ఆరోగ్య సూచనలు మరియు జాగ్రత్తలు వివరించి సుమారు 35మందికి అవసరమయిన మందులు పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు వైద్యాధికారి డాక్టర్ కె. సునీత. సిబ్బంది పి. కోటేశ్వరరావు,యోగ టీచర్ స్వాతి ,మరియు సచివాలయం వాలంటీర్స్ అనిత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వంశీ

విశాలాంధ్ర-గన్నవరం : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బుధవారం ఎమ్మెల్యే డా.వంశీ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు ప్రజలకు చేర్చేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్‌అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నిడమర్తి సౌజన్య నాగేశ్వరరావు, జెడ్పీటీసీ ఎల్జిబెత్ రాణి, ఎంపీపీ అనగానిరవి అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలలో సాయి 98వ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కూచిపూడి : సత్య సాయి 98వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానాలు, వస్త్రధానాలు నిర్వహించారు. మొవ్వ, కూచిపూడి, పెదపూడి, పెడసనగల్లు, భట్ల పెనుమర్రు గ్రామాలలో గల మందిరాలలో ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

స్కేటింగ్‌లో త్రివేణి విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర-గుడివాడ : ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన స్టేట్‌మీట్‌లో త్రివేణి పబ్లిక్ స్కూల్ విద్యార్థి బ్రాంజ్ మెడల్ సాధించడం అభినందనీయమని పాఠశాల డైరెక్టర్ ఎస్.శివశంకర్ అన్నారు. బుధవారం స్థానిక త్రివేణి పబ్లిక్ స్కూల్‌లో స్టేట్ మీట్‌లో బ్రాంచ్ మెడల్ సాధించిన కొల్లూరి వంశీకృష్ణను అభినందించే కార్యక్రమాని నిర్వహించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాయ్‌నగర్‌లో రోడ్లు మరమ్మతులు చేయండి

విశాలాంధ్ర-గన్నవరం : రాయ్‌నగర్‌లోని రోడ్లు డ్రైనేజి వ్యవస్థను మెరుగుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు పెద్దు వెంకటరత్నం ఎమ్మెల్యే వంశీమోహన్‌ను కోరారు. గన్నవరంలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీని కలిసి వినతిపత్రం అందజేశారు. డ్రైనేజీలో నీళ్లు పారుదల అవటంలేదని దీనివల్ల రోడ్లుపైకి వచ్చి రోడ్లు పాడవుతున్నాయని అన్నారు. దోమలు వ్యాప్తి, వీధిలైట్లు స్తంభాన్ని వెలిగించాలని, రోడ్లు ఎమ్మెల్సీ కంభంపాటి రామ్మోహన్ 10 ఏళ్ల క్రితం వేశారని, అవి. పాడిపోయని ఆయన విన్నవించారు. వెంటనే ఎమ్మెల్యే అధికారులను పిలిపించి డ్రైనేజి వ్యవస్థ, రోడ్లుకు వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాయ్‌నగర్ సొసైటీ ఉపాధ్యక్షులు మన్నే సుందరావు, సెక్రటరీ కంభంపాటి వెంకటేశ్వరవు పాల్గొన్నారు.

వడ్లమన్నాడులో ఘనంగా కోటిదీపోత్సవం

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: వడ్లమన్నాడులోని ద్రోణేశ్వరస్వామివారి ఆలయంలో బుధవారం కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది, రైతు ప్రముఖులు పెన్నేరు ప్రభాకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో వందలాది మంది మహిళలు హాజరయ్యారు. ప్రభాకరరావు మాట్లాడుతూ కార్తీకమాసంలో కోటిదీపోత్సవాన్ని నిర్వహించారు. అశేష భక్త జనులు ముక్తిని పొందగలుగుతారన్న విశ్వాసంతోనే దీనిని ఏర్పటు చేసామని చెప్పారు. ఆలయ అర్చక స్వాముల నేతృత్వంలో భక్తులు దీపోత్సవాన్ని తిలకరించారు.

కౌతవరంలో 216 పశువులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: కౌతవరంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 216 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆ క్లబ్ అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ బుధవారం చెప్పారు. ఈ సందర్భంగా 86 మంది పశుపోషకులకు మినరల్ మిక్చర్ పేకెట్లను ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ శిబిరాన్ని ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎ.ఆర్.కె. చౌదరి ప్రారంభించారని సింగం శెట్టి వెల్లడించారు. పశువైద్య శిబిరంలో మందులను కూడా ఉచితంగా అందచేయుట జరిగిందని ఆయన అన్నారు. ఉచిత పశువైద్య శిబిరానికి జిల్లా వెటర్నరీ అధికారి కె. చంద్రశేఖరరావు, రైతు ప్రముఖులు హాజరయ్యారని ఆదినారాయణ వివరించారు.

స్పందనలో యర్రంశెట్టి జన్మదినోత్సవం

విశాలాంధ్ర-గన్నవరం : బాపులపాడు కోపరేటివ్ బ్యాంకు చైర్మన్ యర్రంశెట్టి రామాంజనేయులు జన్మదిన సందర్భంగా గన్నవరం ఉమా ఐశ్వర్య జనరల్ స్టోర్ అధినేత గొపిశెట్టి వీరస్వామి ఆధ్వర్యంలో బుధవారం హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పందన మానసిక వికాస కేంద్రంలో దివ్యాంగుల మధ్యలో గొపిశెట్టి కేకు కట్ చేసి స్వీట్లు పండ్లు పుస్తకాలు పంపిణీ చేసే అన్నదానం చేసారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి వీరస్వామి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కలపాల కరుణాకర్ బడుగు నరేష్ స్పందన అధినేత వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చెవుటూరులో...
సీపీఐ జిల్లా జనరల్ బాడీ సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ : సీపీఐ ఎన్టీఆర్ జిల్లా జనరల్ బాడీ సమావేశం గురువారం ఉదయం 9 గంటలకు జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైయ్యే కామ్రేడ్స్‌కు కొన్ని సూచనలు చేశారు. విజయవాడ నుంచి సొంత వాహనాల్లో వచ్చే వారు ఇబ్రహీంపట్నం మీదుగా మైలవరం వైపు వెళ్లే రూట్ మధ్యలో ఉన్న చెవుటూరు చేరుకోవాలి. బస్సులలో వచ్చే వారు పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్‌లో 350 నంబరు గల బస్సులు, తిరువూరు బస్సులు ఎక్కి చెవుటూరులో దిగాలి. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల నుంచి వచ్చే కామ్రేడ్స్ ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌కు వచ్చి అక్కడ నుంచి 350 నంబరు గల బస్సులు, తిరువూరు బస్సులు ఎక్కి చెవుటూరులో

సీపీఐ జి.కొండూరు మండల కార్యదర్శి గూడూరు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో చెవుటూరులో సీపీఐ జిల్లా జనరల్‌బాడీ సమావేశానికి ఏర్పాట్లు

దిగాలి. తిరువూరు నియోజకవర్గం నుంచి వచ్చే కామ్రేడ్స్ మైలవరం మీదుగా చెవుటూరు చేరుకోవాలి. కామ్రేడ్స్ అంతా సకాలంలో చెవుటూరు చేరుకోవాలని కోరారు.

టీపీ రోడ్డు నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి

- పాలఫ్యాక్టరీ నుంచి ఫోర్‌మెన్ బంగళా మీదుగా ట్రాఫిక్ మళ్లించాలి
- పాతబస్తీ వాసుల ఇబ్బందులను నివారించాలి
- సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్
- తమ్మిన పోతరాజు విగ్రహం వద్ద సీపీఐ ధర్నా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : పాతబస్తీలో ప్రధాన రహదారి తమ్మిన పోతరాజు రోడ్డు(టీపీ రోడ్డు-/కేటీ రోడ్డు) పున:నిర్మాణ పనులు తక్షణమే పూర్తి చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏడాది నుంచి టీపీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతోపాటు వాహనాల రాకపోకలను నిలిపివేయడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యాన బుధవారం ధర్నా నిర్వహించారు. తమ్మిన పోతరాజు విగ్రహం వద్ద నిర్వహించిన ఈ ధర్నాలో జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాతబస్తీ వాసులు ఏడాది నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు తరహాలో ఈ రోడ్డు నిర్మాణాన్ని ఏడాదికి పైగా కొనసాగిస్తూనే ఉన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల నిర్మాణ పనులు తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. దీనివల్ల చిట్టినగర్ నుంచి వన్‌టౌన్‌కు రాకపోకలు నిలిచిపోయాయని, విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ కూలీలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఆటోలు కూడా తిరగకపోవడంతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మేయర్ కనీసం పాతబస్తీ వాసుల కష్టలను పట్టించుకోవడం లేదన్నారు. వారికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూపించకుండా ట్రాఫిక్‌ను నిలిపివేసేవారు కాదన్నారు. మరోవైపు ఎర్రకట్ట దిగువన ఫోర్‌మెన్ బంగళా వద్ద వాహనాల రాకపోకలను చాలాకాలం క్రితమే నిలిపివేశారని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. తక్షణమే ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేషన్ అధికారులు స్పందించి రైల్వే అధికారులతో మాట్లాడి పాలఫ్యాక్టరీ నుంచి రైల్వే యార్డు, ఫోర్‌మెన్ బంగళా మీదుగా పంజాసెంటర్ వరకు ట్రాఫిక్‌ను మళ్లించాలని, తద్వారా పాతబస్తీ వాసుల ట్రాఫిక్ కష్టాలను తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడియ్య, మూలి సాంబశివరావు, పంచాదార్ల దుర్గాంబ, కార్యవర్గసభ్యులు కొట్టు రమణారావు, తూనం వీరయ్య, దోనేపూడి సూరిబాబు, స్థానిక నాయకులు సింగరాజు సాంబశివరావు, బి.రామకృష్ణ, పగిడికత్తుల రాము, టి.పూర్ణయ్య, బి.రవి, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు కేఆర్ ఆంజనేయులు, బెవర శ్రీను, గురునాథం, ఏసు, ఎ.సూరిబాబు, మహిళా సమాఖ్య నాయకులు దుర్గాసి రమణమ్మ, ఆర్.అనసూర్య, కె.సావిత్రి, టి.వెంకటేశ్వరరావ, భార్గవ, శీరం రవి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

సీపీఐ సీనియర్ సభ్యులు రామచంద్రరావు మృతి

రామచంద్రరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సీపీఐ సీనియర్ సభ్యులు వడిపిన రామచంద్రరావు(78) మంగళవారం సాయంత్రం అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. సీపీఐ పార్టీలో అనేక ఉద్యమాల్లో ఆయన చురుకైన పాత్ర పోషించారు. పామీద్ భవన్ యువజన బృందంలో చురుకున పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో ఇంటికి పరిమితమైయ్యారు. చిట్టినగర్‌లోని ఆయన ఇంటిలో తుది శ్వాస విడిచారు.ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరణవార్త తెలుసుకున్న సీపీఐ నగర కార్యదర్శి జీ.కోటేశ్వరరావు ఆయన పార్థీవదేహాన్ని పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. స్థానిక పార్టీ నాయకులు కొరగంజి కనకరావు, బోర్రా రామకృష్ణ, టీ.వెంకటేశ్వరరావు, దేవర శ్రీనివాసరావులతో పాటు వివిధ రాజకీయ పార్టీ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.

మాదక ద్రవ్యాల బానిసల్లో మార్పుకు యువత కృషి చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాల్సిన భాధ్యత నేటి యువతరంపై ఉందని, మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిలో మార్పు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాల నివారణ అవశ్యకతపై స్థానిక ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల విద్యార్థులు జీవితంలో సాధించాలనుకున్న లక్ష్యాలను కోల్పోతారని, మాదకద్రవ్యాల వినియోగంపై ప్రభుత్వం కఠిన చట్టాలను చేసినప్పటికి యువత మాదకద్రవ్యాల మత్తులో చిక్కుకుంటున్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు దైనందిక జీవితంలో పని ఒత్తిడి వల్ల పిల్లలపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చూపలేకపోవడం ప్రధాన కారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డా.జి.సమరం, యూనిట్ కో-ఆర్డినేటర్ జి.విజయ్ స్వరూప్ సింగ్, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డా.కె.భాగలక్ష్మి పాల్గొన్నారు.

జర్నలిస్టు శివరామరాజు మృతి బాధాకరం : అంబటి

విశాలాంధ్ర-విజయవాడ,(గాంధీనగర్) : సీనియర్ పాత్రికేయులు, ఏపీయూడబ్ల్యూజే కృష్ణా అర్బన్ యూనియన్ మాజీ కార్యదర్శి పి.శివరామరాజు గుండెపోటుతో బాధపడతూ బుధవారం కన్నుమూశారు. విజయవాడ శ్రీనగర్ కాలనీలో ఉంటున్న ఆయనకు రెండు రోజుల క్రితం గుండెపోటు రావడంతో ఆసుపత్రిలో చేశారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని ఐజేయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, ఐజేయూ కౌన్సిల్ మెంబరు ఎస్కే బాబు, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగి మల్లారెడ్డిలు సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన 1995-97 సంవత్సరంలో కృష్ణా అర్బన్ కార్యదర్శిగా పనిచేశారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లో పనిచేసిన శివరామరాజు మరణం ఎంతో బాధాకరమని, యూనియన్ కు తీరని లోటని ఈ సందర్భంగా అంబటి ఆంజనేయులు వ్యాఖ్యానించారు.

అర్బన్ యూనిట్ సంతాపం: ఏపీయూడబ్ల్యూజే కృష్ణా అర్బన్ యూనియన్ మాజీ కార్యదర్శి పి.శివరామరాజు మృతిపట్ల విజయవాడ అర్బన్ యూనిట్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. శివరామరాజు కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సంతాపం తెలియజేసిన వారిలో కృష్ణా అర్బన్ అధ్యక్షులు చావా రవి, కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, ప్రెస్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు, కార్యదర్శి ఆర్ వసంత్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు దారం వెంకటేశ్వరరావు, జి రామారావు, దాసరి నాగరాజు, ఫోటోగ్రాఫర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ సాంబశివరావు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

నాడు-నేడు పనుల్లో నాణ్యత ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : నాడు-నేడు పథకం ద్వారా చేపట్టిన పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసి పాఠశాల నిర్వహణ నిధులతో మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతో పాటు విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. నాడు-నేడు పనుల ప్రగతి, గృహ నిర్మాణాలు, స్పందన గ్రీవెన్స్ అంశాలపై బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం నుండి కలెక్టర్ మండల స్థాయి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణలో ఎంపీడీవోలు, ఎంఆర్‌వోలకు భాధ్యత లేదాని విద్యా ప్రమాణాలను పెంచి మౌలిక వసతుల అభివృద్ధి చేసేందుకు పాఠశాలలను సందర్శిస్తున్నారాని ప్రశ్నించారు. విద్యాప్రమాణాలను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, ఎఇవోలను ఆదేశించారు. పాఠశాలలో ఎస్‌యంఎఫ్, టీఎంఎఫ్ నిధుల ద్వారా చేపట్టిన పనుల నివేదికలను పాఠశాలల వారిగా తక్షణమే సమర్పించాలని డీఇవోలను ఆదేశించారు. డిసెంబర్‌లో నిర్వహించే సామూహిక గృహప్రవేశాలకు లక్ష్యం నిర్దేశించిన 12,264 గృహ నిర్మాణాలను పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. గృహా నిర్మాణాల లక్ష్యాల్లో ప్రగతి కనపర్చిన మైలవరం, నందిగామ, జి.కొండూరు మండల ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జేసీ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్‌వో కె.మోహన్‌కుమార్, డీఇవో సీవీ రేణుక, హౌసింగ్ పీడీ శ్రీదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ డీవీ.రమణ, పంచాయతీరాజ్ ఎస్ఇ ఏ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అద్దె చెల్లించలేదని సచివాలయానికి తాళం

విశాలాంధ్ర-గంపలగూడెం : ఊటుకూరులోని సచివాలయం-2 భవనానికి మూడు సంవత్సరాలుగా అద్దె, కరెంటు బిల్లులు కూడా చెల్లించకపోవడంతో సచివాలయ సిబ్బందిని బయటకుపంపి సచివాలయ భవనాన్ని అద్దెకిచ్చిన యజమాని భవనానికి తాళం వేశాడు. 2019లో సచివాలయానికి తన భవనాన్ని అద్దె ఇవ్వమని, నెలకు రూ.5,500 అద్దె, కరెంటు బిల్లులు చెల్లించేటట్లు తనచేత అప్పటి మండల స్పెషల్ ఆఫీసర్ ఎర్రమల పిచ్చిరెడ్డి, గ్రామ కార్యదర్శి విజయ్ వర్ధన్లు అగ్రిమెంటు రాయించుకున్నారని భవన యజమాని ప్రకాష్ బాబ్జి తెలిపారు. అద్దె చెల్లించమని మండల కేంద్రంలో స్పందన కార్యక్రమంలో ఎన్నిసార్లు దరఖాస్తు ఇచ్చినా స్పందన లేదని, దీంతో సచివాలయ భవనానికి తాళం వేసినట్లు ఆయన తెలిపారు.

ఉత్సాహపూరితమైన ఆఫర్లు, రాయితీలతో క్రోమా బ్లాక్ ఫ్రైడే సేల్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దేశంలో మొట్టమొదటి, అత్యంత నమ్మకమైన ఓమ్నీ ఛానెల్ ఎలక్ట్రానిక్స్ రిటైలర్, టాటా గ్రూప్‌కు చెందిన క్రోమా, ఇప్పుడు దార్కెస్ట్ బ్లాక్ ఫ్రైడే సేల్‌ను అత్యంత ఉత్సాహపూరితమైన ఆఫర్లతో తీసుకువచ్చింది. ఈ సేల్ నవంబర్ 18 నుంచి స్టోర్స్, క్రోమా వెబ్‌సైట్‌పై అందుబాటులో ఉంది. అస్సలు వదులుకోలేనట్టి ఆఫర్లను విస్తృత శ్రేణి ఎలక్ట్రానిక్స్ హోమ్ అప్లయెన్సస్, కంప్యూటర్స్, స్మార్ట్ టీవీలు, స్మార్ట్‌ఫోన్‌లపై అందుకోవచ్చు. స్టోర్ లోపల షాపింగ్ అద్భుతం నవంబర్ 25-27 మధ్య ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ కొనసాగుతుంది. క్రోమా ఇప్పుడు మూడు బ్యాండ్లు అందిస్తుంది. అవి బ్లాక్ ఆఫరింగ్ 7 శాతం, గ్రే 5 శాతం, వైట్ 3 శాతం రాయితీని స్టోర్ లోపల లక్కీ డ్రా విజేతలకు అందిస్తుంది.

అత్యాధునికంగా మారుతి సుజుకి న్యూ ఈకో

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్, శక్తివంతమైన, ఇంధనాన్ని మరింతగా పొదుపు చేయగల న్యూ ఈకోలో డ్రైవ్ చేస్తోంది. మారుతి సుజుకి ఈకో, ఈ విభాగంలో స్థిరంగా ఆధిక్యతను ప్రదర్శిస్తోంది. తన విజయాన్ని ముందుకు తీసుకువెడుతూ న్యూ ఈకోను వినూత్నంగా ఇంజనీర్ చేసి, ద్విప్రయోజనాత్మకమైన వాహనంగా, కస్టమర్ల పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా రూపొందించారు. విశాలమైన ఫ్యామిలీ కార్ కోసం వెదుకుతున్న వినియోగదారుల అవసరానికి అనుగుణంగా మార్చుకోగల ఇంటీరియర్ స్పేస్ కలిగిన ఒక ప్రాక్టికల్ వాహనం కోరుకుంటున్న ఎంటర్ప్రెన్యూల డిమాండింగ్ అవసరాలను ఇది భరోసాతో తీరుస్తుందని మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ అండ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన విప్ ఉదయభాను

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : పట్టణంలోని 27వ వార్డులో ఉన్న స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎమ్మెల్య సామినేని ఉదయభాను బుధవారం తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో వసతుల కల్పన, విద్య, భోజన వసతి, విద్యార్థుల హాజరు తదితర అంశాలను ప్రతిరోజు పరిగణలోకి తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల వసతుల కల్పనపై ఇతర అంశాలపై పరిశీలించి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక గురుకుల పాఠశాలల ఏర్పాటు, పాఠశాల విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు జగనన్న ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమేష్ బాబు, వార్డెన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒకే లాగిన్‌తో మల్టీ ఎక్ఛేంజ్, రూపాయితో నడిచే మొదటి క్రిప్టో ప్లాట్‌ఫారమ్ గా కాయిన్‌స్విచ్ ప్రో

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మల్టీఎక్ఛేంజ్ ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్ కాయిన్‌స్విచ్ ప్రోను ప్రారంభిస్తున్నామని భారతదేశంలోని అతి పెద్ద క్రిప్టో ఇన్వెస్టింగ్ యాప్ కాయిన్‌స్విచ్ ప్రకటించింది. మొట్టమొదటి తరహా కెవైసీ-కాంప్లియెంట్ ప్లాట్‌ఫారమ్ నుంచి వినియోగదారులు ఒకే లాగిన్‌తో మల్టీ-ఎక్ఛేంజ్‌లలో భారతీయ రూపాయలలో క్రిప్టోను ట్రేడింగ్ చేసుకునేందుకు అనుమతిస్తుంది.

ఆర్థరైటిస్ రోగుల శస్త్రచికిత్సా సంరక్షణలో మార్పులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో శారీరక వైకల్యానికి నాలుగో అతి పెద్ద కారణంగా ఆర్థరైటిస్ ఉంటుందని అంచనా. వ్యాధి ముదురుతున్న కొద్ది నొప్పి కారణంగా రోగుల్లో వైకల్యాలు ఏర్పడటంతో పాటు శారీరక కదిలికలు కూడా పరిమితమైపోయి వారి ఉత్పాదక సంవత్సరాలు తగ్గుతాయి. పెరుగుతున్న ఆర్థరైటిస్ కేసుల విషయంలో అవగాహన పెంచేందుకు. చికిత్సలో సాధించిన సరికొత్త విజయాల గురించి వివరించేందుకు జాన్సన్.అండ్ జాన్సన్ మెడ్‌టెక్ ఇండియా, గంగా మెడికల్ సెంటర్, హాస్పిటల్స్ ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. రోగులు తిరిగి తమ జీవితాల్లోకి వేగంగా చేరేలా ఈ సాంకేతిక పరిజ్ఞానం రూపొందించడం జరిగిందని జాన్సన్ అండ్ జాన్సన్ మెడ్‌టెక్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ తెలిపారు.

ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ 'గోల్డ్‌లోన్ మేళా' బంపర్ ఆఫర్లు

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : భారతదేశంలోని అతిపెద్ద నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలలో ఒకటైన ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ నవంబర్ 15, 2022 నుండి డిసెంబర్ 31, 2022 వరకు కస్టమర్లందరికీ 'గోల్డ్ లోన్ మేళా బంపర్ ధమాకా'తో గోల్డ్‌లోన్‌పై అద్భుతమైన ఆఫర్‌లను ప్రారంభించినట్లు తెలిపింది. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ గోల్డ్ లోన్ బిజినెస్ హెడ్ సౌరభ్ కుమార్ మాట్లాడుతూ, ఈ ధమాకా ప్రారంభోత్సవం సందర్భంగా ఐఐఎఫ్ఎల్ గోల్డ్ లోన్ చాలా ఎక్కువ కస్టమర్ లాయల్టీతో దేశంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన గోల్డ్‌లోన్ బ్రాండ్లలో ఒకటిగా వుంది. దానికి కృతజ్ఞతగానే ఈ గోల్డ్‌లోన్ ప్రారంభించినట్లు చెప్పారు.

ఏఐటీయూసీ జాతీయ మహాసభల కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: ఆల్ ఇండియా బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏడవ జాతీయ మహాసభలు రాజమండ్రిలో ఈ నెల 26 27 28 తేదీలలో జరుగుతున్న సందర్భంగా జగ్గయ్యపేట మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రిలు కూలీల అడ్డా వద్ద జాతీయ మహాసభల కరపత్రాలు కార్మికులకు పంపిణీ చేశారు. అదే విధంగా మండలంలోని చిల్ల కల్లు గ్రామంలో కూడా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వావిరాల యాదగిరి ఆధ్వర్యంలో చిలకల్లులోని తాపీ మేస్త్రి లకు కూలీలకు జాతీయ మహాసభ కరపత్రాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నీలకంఠ శివప్రసాద్, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి పోతుపాక వెంకటేశ్వర్లు, చిట్యాల మల్లయ్య వీర్ల శ్రీనివాసరావు, వేముల శీను, ఎస్కే కాజా మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు పాటుపడాలి : డీఆర్ఓ మోహన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానిని సాధించేందుకు పాటుపడాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహనకుమార్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల డిబైటింగ్ అండ్ క్విజ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సారస్వత పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మోహనకుమార్ మాట్లాడుతూ మానవ జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైనదన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి : మేయర్

విద్యార్థులు తమకు ఎదురైన అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగటానికి కృషి చేయాలని నగర మేయర్ రాయిన భాగ్యలక్ష్మి అన్నారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసానికి పదును పెట్టేందుకు ఈ పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. కేబీఎన్ కళాశాల విద్యారంగానికి అపూర్వమైన సేవలు అందిస్తుందని ప్రశంసించారు. అనంతరం విజేతులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యకుమార్, డిబేటింగ్ అండ్ క్విజ్ క్లబ్ కన్వీనర్ శాంతి, అధ్యాపకులు వీ.శేషగిరిరావు, విజయకుమార్, ప్రత్యూష, డీ.పవన్ కుమార్ పాల్గొన్నారు.

నరసాపురంలో గడపగడపకూ కార్యక్రమం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: మండలంలోని నరసాపురం గ్రామంలో బుధవారం తిరువూరు ఎమ్మెల్సీ కె.రక్షణనిధి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దారు కె.లక్ష్మి, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, ఎంపీపీ పి.మెర్సీ వనజాక్షి, జడ్పీటీసీ సభ్యుడు బీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, స్థానిక నేతలు అల్లు గణపతిరెడ్డి, తాణంకి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాసంబరాలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలంలో మంగళవారం ప్రారంభించిన తిరువూరు నియోజకవర్గ స్థాయి క్రీడాసంబరాలు బుధవారం ముగిసాయి. వాలీబాల్, బాల్‌బాడ్మింటన్ క్రీడలను మంగళవారం పుట్రేల జడ్పీ పాఠశాలలో నిర్వహించగా, నియోజకవర్గ క్రికెట్ టోర్నమెంట్‌ను విస్సన్నపేట ప్రభుత్వ కళాశాల వద్ద ఉన్న మైదానంలో నిర్వహించామని నియోజకవర్గ క్రీడల నిర్వహణాధికారి ఎం.రమేష్ తెలిపారు.

ఆర్బీకేల్లో రైతులకు కావ్వాల్సిన అన్ని సేవలు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను అధ్యయనం చేయుటలో భాగంగా బుధవారం పెనుగంచిప్రోలుకు కేంద్ర ప్రభుత్వ కో ఆపరేషన్ డిప్యూటీ సెక్రటరీ సందీప్ కుమార్ సింగ్ విచ్చేసారు. సహకార సంఘాలు, ఆర్బికె,పెట్రోల్ బ్యాంకు పనితీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన అన్నిసేవలు ఒకే చోట నుండి అందుతున్నాయని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టబోవు పథకాలు అనగా పెట్రోల్ బంకులు మొదలైనవి ముందుగానే రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు.

త్వరలో రైతులకు రాయతీ డబ్బులు

విశాలాంధ్ర-వీరులపాడు: 2021 సంవత్సరం రబి సీజన్లో పంట రుణాలు తీసుకున్న రైతులకు రాయతీలు ఈనెల 29న బ్యాంకులలో ప్రభుత్వం జమ చేయనున్నట్లు ఏఓ జోగేంద్ర ప్రసాద్ బుధవారం తెలిపారు. వీరులపాడు మండలంలో అర్హులైన 449 రైతులకు రాయతీలు జమ కానున్నట్లు తెలిపారు. అర్హులైన రైతుల జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం స్థానిక ఆర్బికే కేంద్రాల వద్ద ఉంచినట్లు ఆయన తెలిపారు.

ఘంటసాల గళ మాధుర్యం భవిష్యత్తరాలకు అందాలి

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : సామాజిక, సాంఘిక, మానవీయ విలువలతో, తెలుగు భాష, సంగీత వికాసాలను కలిగిస్తూ వేలాది పాటలు ఘంటసాల గళం నుంచి జాలువారి నవరసాలను పండిస్తూ సంగీత శ్రోతలకు మాధుర్యాన్ని పంచిందని వాటిని భవిష్యత్తరాలకు అందించే లక్ష్యంతో ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక ఆవిర్భవించిందని సంస్థ జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. కౌతా పూర్ణానంద సత్రం రూమ్ నెంబర్ 2 లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటువంటి గంధర్వ గాయకునికి ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని కోరారు. గాయకులు దేవిడ్ రాజు,మద్దెల శ్యాంప్రసాద్ లు మాట్లాడుతూ ఘంటసాల పాటలు ఆలపిస్తున్న సమయంలో తమను తాము మరిచిపోతామని,శరీరం పులకించిపోతుందని అన్నారు. సమావేశంలో పట్నాల సత్యనారాయణ, గానుగుల రాజారావు, యాకోబు పాల్గొన్నారు.

వేస్ట్ పికర్స్ గౌరవ ప్రదంగా జీవించాలి



విశాలాంధ్ర-విజయవాడ,(గాంధీనగర్) : నగరంలో వేస్ట్ పికర్ జీవనవిధానంలో మార్పు తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందని వాటిని సద్వినియోగించు కొవాలని నగరపాలక సంస్థ అసిస్టెంట్ మెడికల్ అఫీసర్ అఫ్ హెల్త్ (ఎఎమ్ఒహెచ్) (సర్కిల్-2) వి.రామకోటేశ్వరావు కోరారు. బుధవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డిబిఆర్‌సి)ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో వేస్ట్ పికర్‌కు ప్రభుత్వ పథకాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.దీనికి వై సిఎస్ మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వేస్ట్ పికర్‌కి మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అన్ని విధాలుగా సహాయం చేయాడనికి ఎప్పుడు సిద్దంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.వి.శ్రీధర్,బి.దేవాలక్ష్మి బి.కోసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ బీమా అవసరం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: అనుకోని సంఘటనలు జరిగి ప్రమాదవశాత్తు కుటుంబ పెద్ద మరణించినపుడు ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేది ఇన్సూరెన్స్ కంపెనీ లేనని జబర్దస్త్ కామెడీ ఎంటర్టైనర్ అప్పారావు (ఆసం అప్పీ) అన్నారు. బుధవారం ఆయన పట్టణంలో కోదాడ రోడ్డులో ఉన్న ఒఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ కం.లి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్స్ వల్ల కుటుంబాలకు చేకూరే ఉపయోగాల గురించి వివరించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా, ప్రమాద బీమా లు కూడా అవసరమేన న్నారు. అనంతరం జగ్గయ్యపేట బ్రాంచిలో మొదటి స్థానంలో ఉన్న సీనియర్ లైఫ్ మిత్ర మాశెట్టి రమేష్ బాబుని దుస్సాలువతో అప్పారావు సత్కరించారు. అదే విధంగా కార్యాలయ సిబ్బందితో పాటు లైఫ్ మిత్ర లు అందరూ జబర్దస్త్ అప్పారావు ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ కృష్ణ వర్ధన్ రెడ్డి, మోటివేటర్ సుబ్బారెడ్డి,బ్రాంచ్ మేనేజర్ హరేరామ శ్రీధర్, యూనిట్ మేనేజర్ లు వరలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది మధు,రాధాకృష్ణ,రాము లైఫ్ మిత్ర లు పాల్గొన్నారు.

కేవీఆర్ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : సైన్స్ ఎగ్జిబిషన్‌లో భాగంగా కెవిఆర్ జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం విద్యార్థులు తమ నమూనాలను, ప్రయోగాలను ప్రదర్శించారు. హెచ్ఎం కె జలజ ఎగ్జిబిషన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థి దశలో పరిశీలన, పరిశోధన ముఖ్యమని ఆమె తెలిపారు. వీటిలో ఐదు నమూనాలను ఎంపిక చేసి మండల స్థాయికి పంపనున్నట్లు సీనియర్ సైన్స్ ఉపాధ్యాయులు పొడుగు శ్రీనివాసరావు, సంధ్యారాణి, కోటేశ్వరరావు, సత్యనారాయణలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, సునీల్, చా ట్ల.నిరంజన్, కాంత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కాలిగ్రఫీ పోటీలకు
కలెక్టర్ కుమారుడు జివితేష్ ఎంపిక

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : చెట్టు ఒకటైతే విత్తనం మరొకటి అవుతుందా.. అనే పోలిక ఈ తండ్రీ కొడుకులకు సరిగ్గా నప్పుతుంది. తండ్రి అడుగు జాడల్లో నడవటమే కాదు తండ్రికి తగ్గ తనయుడుగా అన్నింటిలోను రాణిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు కుమారుడు జివితేష్. సాధారణంగా తల్లిదండ్రులు పెద్ద హోదాలో ఉంటే కుమారులు ధీమాగా వ్యవహరించే ఘటనలు మనం తరచు చూస్తువుంటాం. తండ్రి ఒక ప్రఖ్యాత జిల్లాకు ఉన్నతాధికారి తల్లి మరొక జిల్లాకు ఉన్నతాధికారి, చిన్నతనం నుండి కష్టపడి వృద్ధిలోకి వచ్చిన తండ్రిని స్ఫూర్తిగా తీసుకుని తనదైన స్థాయిలో రాణిస్తున్నాడు ఎస్.జివితేష్. వచ్చే ఏడాది జనవరి 22న జాతీయ స్థాయి చేతిరాత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఒలింపియాడ్ జాతీయ స్థాయి కాలిగ్రఫీ పోటీలకు రాష్ట్రం నుండి జివితేష్ ఎంపికయ్యారు. గతంలో రాష్ట్ర స్థాయి చేతివ్రాత పోటీల్లో మొదటి స్థానాన్ని సంపాదించిన జివితేష్ ఈ సారి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. విజయవాడ నగరంలోని నలంద విద్యానికేతన్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్న జివితేష్ ఒలింపియాడ్ జాతీయ స్థాయి కాలిగ్రఫీ పోటీలకు ఎంపికైనట్లు హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ మెహబూబ్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులలో నైపుణ్యాన్ని, సృజనాత్మకతను పెంపొందించేందుకు హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్, అమ్మఒడి హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆలిండియా గ్రాఫాలజిస్ట్ సంస్థ ప్రతి మూడేళ్లకు ఒకసారి ఒలింపియాడ్ జాతీయ స్థాయి కాలిగ్రఫీ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని, రాష్ట్రస్థాయిలో 14 వేల మంది హాజరవ్వగా జివితేష్ ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ పోటీలు దేశవ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా జరుగుతాయని రాష్ట్ర నుంచి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎక్కువగా పాల్గొంటున్నారన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 3 లక్షల మందికిపైగా విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందని, జాతీయ స్థాయి కాలిగ్రఫీ చేతివ్రాత నిపుణులు భువనచంద్ర తలిపారు. జివితేష్ రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి ఒలంపియాడ్ పోటీలకు ఎంపిక కావడం పట్ల పలువురు అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

ది ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్
(గవర్నమెంట్ పార్టనేరెడ్ షెడ్యూల్డ్ బ్యాంక్)
27-29-28, ఎన్.టి.ఆర్. సహకార భవన్, గవర్నర్‌పేట,
విజయవాడ-520002. ఫోన్ నెం.0866-2429080, 7729993171

బంగారు నగల వేలం నోటీసు

ఈ దిగువ పట్టికలో పేర్కొనబడిన వ్యక్తులు మా వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి అప్పు తీసుకొనియున్నారు. సదరు బాకీలు సకాలంలో చెల్లించనందున వాటి బకాయిలు పూర్తిగా చెల్లించి నగలు విడిపించుకొనవలసిందిగా మా వద్ద గల వారి చిరునామాలకు పలుమార్లు నోటీసులు పంపించినాము. సదరు బకాయిలు చెల్లించనందున ది : 29.11.2022 (మంగళవారం) సాయంత్రం 04 : 00 గంటలకు మా బ్యాంకు (ప్రధాన కార్యాలయ) ఆవరణలో మా వద్ద తాకట్టులో ఉన్న బంగారు ఆభరణములను వేలం వేసి బకాయిలను జమచేయబడును. ఇంకనూ ఏమైనా బాకీ మిగిలి ఉన్నయెడల చట్టరీత్యా బాకీదారుల నుండి వసూలు చేయబడును. ఆసక్తి ఉన్న వారు వేలములో పాల్గొనవచ్చును. వేలములో పాల్గొనువారు రూ.10 వేలు (E.M.D) ధరావత్తు సొమ్ము కట్టవలెను. ఎట్టి కారణము చూపకనే వేలమును నిలిపివేయుటకుగాని, వేలములో ఎక్కువ ధరకు పాడిన ధరను (Highest Bid) ఆఫరు తిరస్కరించుటకుగాని సర్వహక్కులు బ్యాంకు వారికి ఉన్నవి. వేలములో వస్తువులు పాడుకున్నవారు సగదు వెంటనే చెల్లించవలెను. మరింత సమాచారం కొరకు AGM (BRCC), APCOB వారిని సంప్రదించగలరు.

లోన్ ఖాతా నెం.	ఖాతాదారుని పేరు, చిరునామా	మొత్తము బరువు గ్రా.
కానూరు శాఖ		
110000220411	డి దుర్గారావు, డి.నెం.18-169/ఎ, మదీనా మసీదు, సనత్ నగర్, విజయవాడ-520007.	4.40
వేణుగోపాల నగర్ శాఖ		
110000356849	జి నవీన్ కుమార్, ఫ్లాట్ నెం.202, ప్రేమ్ రెసిడెన్సీ, 3వ లైను, వెంకటరమణ కాలనీ, గుంటూరు-522006	27.00

తేది : 24.11.2022
ప్రదేశం : విజయవాడ
సం/-
అసిస్టెంట్ జనరల్ మేనేజర్